

# శ్రీ కల్యాణీయం
## – సింగీతం లక్ష్మీ కల్యాణి



*విశేషమైన ఖ్యాతి గడించిన సినీదర్శకుడి భార్య అయినప్పటికీ ,*

*సాధారణ గృహిణిగా ఎదుగుతూ*

*కుటుంబాన్ని అందంగా తీర్చిదిద్దుకున్న ఓ మహిళ స్ఫూర్తిదాయకమైన ఆత్మకథ..!!*

*(గత సంచిక తరువాయి)*

**జనవరి 2012వ** సంవత్సరం అడుగిడగానే మావారికి హైదరాబాద్ నుంచి పిలుపు వచ్చింది. ఆయన యాక్ట్ చేసే సినిమా జనవరి 2వ తేదీనుంచి ఆరంభమని, మొదటి తేదీ బయల్దేరమని అన్నారు. కానీ కొత్త సంవత్సరం మొదటి తేదీన రాఘవేంద్ర స్వామి గుళ్ళో అభిషేకముందని రెండవ తేదీన వస్తామని చెప్పి 2న సాయంత్రం బయల్దేరి 7 గంటలకి చేరుకున్నాము. ఎయిర్‌పోర్టుకి స్వయానా ప్రొడ్యూసరు, డైరెక్టరు వచ్చి రిసీవ్ చేసుకున్నారు. 3వ తేదీన మేకప్ టెస్ట్ చేసి 4 నుంచి జనవరి 2 వరకు షూటింగులు సాగాయి. 13 పొద్దున ఫ్లైట్‌కి చెన్నై వచ్చేశాము. మేం 3న వెళ్ళినవాడే ప్రొడ్యూసరు శ్రీనివాస్‌గారు, తన భార్య లలితని స్టూడియోకి పిల్చుకువచ్చి పరిచయం చేశారు. షూటింగు సారథీ స్టూడియోలో జరిగింది. మావారికి పెయిర్ అయిన తులసి కూడా వచ్చింది. మేకప్‌లో మావారిని ఎవ్వరూ గుర్తుపట్టలేదు. షూటింగయి మద్రాసుకు ప్రయాణమయేటపుడు శ్రీనివాస్‌గారు, కిరణ్ కారు వద్దకు వచ్చి రెండవ షెడ్యూల్‌కి నన్ను కూడా రమ్మన్నారు.

షూటింగు జరిగినన్నాళ్ళు లలిత, తులసి నాకు మంచి కంపెనీ ఇచ్చారు. అప్పుడప్పుడు శ్రీనివాస్‌గారి తల్లి కూడా వచ్చేవారు. నేను కలివిడిగా మాట్లాడ్తానని ఆవిడ నన్ను చాలా మెచ్చుకున్నారు. రెండవ ఆదివారం షూటింగు లేనందున ప్రొడ్యూసరు గారింటికి మమ్మల్ని భోజనానికి పిలిచి మర్యాద చేశారు.

సంక్రాంతి పండుగలైన తర్వాత జనవరి 26న రిపబ్లిక్‌డే కదా. ఆవేళ మా కాలనీ అసోసియేషన్ సభ్యుల పిల్లలతో కల్చరల్స్ చేసారు. అంతకు ముందు కొంతమంది పిల్లలు, పెద్దలు స్పోర్ట్స్ పోటీలలో పాల్గొన్నారు. గెలిచిన వారికి 26న ప్రైజెస్ ఇచ్చారు. ఆవేళ జరిగిన కల్చరల్స్‌లో కొంతమంది గ్రూపు సాంగ్స్ పాడారు, కొంతమంది డ్యాన్సు చేశారు. స్నేహ ముందుగానే అభినవ్ పేరునివ్వడం వలన అభినవ్ సోలో కీబోర్డు వాయించాడు. తరువాత సోలో డ్యాన్సు చేశాడు. మూడు పాటలు డ్యాన్సులో ఆకరి డ్యాన్సు జైహూ పాట డ్యాన్సు చేసేసరికి అందరూ చప్పట్లు కొట్టారు. చాలామంది పిల్లలు షేక్‌హేండిచ్చి అభినందించారు వాడు వాళ్ళకి పరిచయం లేకపోయినా కూడా. కీ బోర్డు కూడా బాగా వాయించాడని అందరూ మెచ్చుకున్నారు ఆవేళ వాళ్ళ నాన్న కార్తీక్ తిరుచ్చి నుంచి వచ్చినందువలన లక్కీగా తన కొడుకు ప్రోగ్రాం చూశారు. Actually ఆయన ఢిల్లీ నుంచి ఆ సాయంత్రం ఫ్లైట్‌లో వచ్చారు. మర్నాడు సెలవైనందు వలన 26న రాత్రి ఫ్లైట్‌కి తిరుచ్చివెళ్ళారు.

రిపబ్లిక్ డే మా కాలనీ కల్చరల్స్, మా మనమడి ప్రోగ్రాం అయినతర్వాత మా వారు ఒకే ఒకరోజు షూటింగుందని జనవరి 27న పొద్దున్న ఫ్లైట్‌కి వెళ్ళి రాత్రి ఫ్లైట్‌కి తిరిగి వచ్చేశారు. ఒక్కరోజు కదా అని నేను వెళ్ళలేదు. ఇంతలో ఆ రోజే తులసి, లలితగారు ఫోను చేసి నాతో హైదరాబాదు నుంచి మాట్లాడారు. తర్వాత ఫిబ్రవరి 8నుంచి షూటింగు ఉందని 7వ తారీఖున పొద్దున్న ఫ్లైట్‌కి వెళ్ళి మధ్యాహ్నం భోజనం హోటల్‌లో తిన్నాము. రెండుసార్లు మేము దిగిన హోటలు ఇన్నర్ సర్కిల్. మంచి హోటలు, శాఖాహారం. ఇది మల్లాది మూర్తిగారు సజెస్ట్ చేశారు. అక్కడ మొత్తం మేము ఇరవైరోజులు గడిపాము. మధ్యాహ్న భోజనం షూటింగ్ స్థలంలో మెస్ నుంచి వచ్చేది. అది బాగానే ఉండేది, ఇంటివంటలాగ. ఈ హోటల్ వాళ్ళు మమ్మల్ని ఏం వంటలు కావాలో అడిగి వండి మరీ చేసేవారు. అందుకే మేం మదరాసుకు తిరిగి వచ్చేటప్పుడు అక్కడున్న ముఖ్యమైన వాళ్ళకి బహుమతులు యిచ్చివచ్చాము.

ఇక షూటింగు రోజులలో లలితగారు రోజూ వస్తూ నాకు కంపెనీ యిచ్చేవారు. షూటింగు విరామ సమయంలో తులసి వచ్చి కబుర్లు చెప్తూ ఉండేది. నన్నూ, మా వారిని అమ్మా, నాన్నా అని పిలిచేది. నాకైతే విసుగు లేకుండా చాలా సరదాగా గడిచింది. ఇక దూరాన షూటింగైతే, ఆ మసాలాల అన్నం అదీ, మా యిద్దరికీ పడదని ప్రొడ్యూసరుగారు ఇంట్లోనే వండించి భార్య లలిత మాకు భోజనం తెచ్చే ఏర్పాటు చేసారు. మాతోబాటు తులసికి కూడా తెచ్చేవారు. ఈ విషయంలో లలిత చాలా సహనంగా మెలిగేవారు. కొంచెం కూడా విసుక్కునేవారు కాదు. అప్పుడప్పుడు వాళ్ళిద్దరి పిల్లల్ని షూటింగుకి పిల్చుకు వచ్చేవారు. ఇంటర్మీడియట్ చదువుతున్న అమ్మాయి, 8వ తరగతి చదువుతున్న అబ్బాయి.

హైదరాబాదులో కొంతమంది అబ్బాయిలు పరిచయం అయ్యారు. కోటీగారబ్బాయి రాజీవ్, సినిమాలో హీరోవేసిన అబ్బాయి అజయ్, ఒక కన్నడ అమ్మాయి. ఇలా భీమవరం అబ్బాయిలు కూడా తటస్థపడ్డారు. వీరందరూ ఆర్టిస్టులు. వారిలో దక్షిత్ అనే అబ్బాయి భీమవరం గురించి చెపుతూంటే నాకు చాలా సంతోషం వేసేది. అసలతనిది పాలకొల్లు భీమవరం పాలకొల్లుకి దగ్గరే అవడం వలన భీమవరంకి ఆ అబ్బాయి తరచూ వెళ్ళడం, అక్కడ పొలాలు, కోడిపందేల పోటీలు ఫోటోలు తియ్యడం అతని హాబీ. అవి నాకు కొన్ని చూపించాడు. నేను కూడా అక్కడ చదివానని, మా పెళ్ళి అక్కడే అయినది అని చెపితే అతను చాలా సంతోషించేవాడు.

తులసి "అమ్మా! మీ భీమవరం అబ్బాయి మీకు మంచి కంపెనీ యిచ్చాడా?" అని అడిగేది. భీమవరం కబుర్లు చెప్తూ ఇంకా ఒకరిద్దరూ భీమవరం వాళ్ళు కూడా ఆ యూనిట్‌లో ఉన్నారు. దక్షిత్ నాన్నగారు కూడా, ఫలానా సింగీతం శ్రీనివాసరావుగారి భార్య భీమవరం ఆవిడే అని తెలిసి సంతోషించారని చెప్పాడు నాతో. అక్కడ కొన్ని సంవత్సరాలే వున్నా పశ్చిమ గోదావరి అన్నా, తూర్పు గోదావరి ఊళ్ళ పేరు విన్నా నాకు చాలా సంతోషంగా ఉంటుంది ఇప్పటికీ. ఈ వయసులో మళ్ళీ ఆ ఊళ్ళన్నీ తిరగగలమా?

షూటింగు సమయంలో డైరెక్టర్ కిరణ్‌గారు మా వారిని, సీనియర్ డైరెక్టర్ కదూ! చాలా గౌరవంగా చూసుకునే వారు. నన్నూ, మా వారిని బాయ్స్ మొదలుకుని, శ్రీనివాస్‌గారు, కిరణ్ కూడా చాలా గౌరవంగా చూసుకునేవారు. నేను మెట్లు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు అందరూ నాకు చేయూత నిచ్చేవారు. మమ్మల్నిద్దరినీ ప్రొడ్యూసర్‌గారు, భార్య వాళ్ళ కుటుంబ సభ్యులుగా చూసుకునేవారు. శ్రీనివాస్ గారైతే ఎప్పుడూ మమ్మల్నిద్దరిని పార్వతీ, పరమేశ్వరుల్లాగా వచ్చారు అంటూండేవారు. షూటింగయిన తర్వాత రెండురోజులకి మేము ఒక పెళ్ళికి అటెండ్ అవవలసివస్తే హోటల్ ఖాళీ చెయ్యనివ్వలేదు ప్రొడ్యూసర్‌గారు.

ఇకపోతే, ఒక రోజు రాత్రి బారసాల, ఉయ్యాల సీనులు వచ్చాయి. పూల అలంకరణ, ఉయ్యాల అలంకరణలో పూలదండలతో అలంకరణతో పాటు విడిపూలు కూడా నేలమీద వేసారు. రిహార్సల్సులో మా వారు ఆ పూలమీద చెప్పు జారి కిందపడబోయారు. కానీ కిరణ్ వెంటనే వెళ్ళి మా వారిని పట్టుకున్నారు. వెల్లికిలా పడవలసిన మావారు పడలేదు. కానీ మోకాలు దగ్గర ఎముక కొంచెం వంకర తిరిగి మోకాలు నొప్పి పెట్టింది. కిరణ్, మరి యిద్దరు మా వారిని రెండు వైపులా పట్టుకుని, కుర్చీలో కూర్చోపెట్టి, కాలుకింద మరొక కుర్చీవేసి, డైరెక్టర్ కిరణ్ కాలు షూస్ విప్పి, మోకాలు మర్దనా చేస్తూ చటుక్కున తెప్పించిన Volini spray వేసి కాసేపురుద్దారు.

"మీరేమిటండీ కాలు బూట్లు విప్పుతార"న్నా ఆయన వినిపించుకోలేదు. మావారిని కాసేపు అలాగే విశ్రాంతి తీసుకొమ్మని చెప్పి, షాట్‌కి వెళ్ళిపోయారు. కాసేపుండి మావారే రెండే రెండు షాట్లుకదా చేస్తానంటూ ఇద్దరి ముగ్గురి సహాయంతో షాట్ దగ్గరికెళ్ళి ఎలాగో టేక్స్ చేసారు.

మెట్లపైన కుర్చీలో కుర్చుని షూటింగు చూస్తున్న నేను మా వారు పడగానే లేచి నిల్చుని ఆయన్ని చూడ్డానికని మెట్లవద్దకు వెళ్ళాను. నా ఉద్దేశం ఆయన వెల్లకిలా పడ్డారని ఆయన్ని చూడగానే టెన్షన్‌లో నేను కింద తూలి పడబోతుంటే యిద్దరు ముగ్గురు ఆడవాళ్ళు నన్ను ఒక కుర్చీలో కూర్చోపెట్టి, నాకు ఉపచారాలు చెయ్యసాగారు. నేను ఏడుస్తున్నాను. ఇంతలో షూటింగ్ స్పాట్‌నుంచి తులసి పరుగు పరుగున మెట్లెక్కి వచ్చి "అమ్మా! అమ్మా! సార్‌కి ఏమీ అవలేదుట. ముందు మీకు చెప్పి రమ్మన్నారు, కంగారు పడకండి. సో స్వీట్! చూడండి, సారు పడినా కూడా మీరు కంగారు పడ్తారని నన్ను చెప్పి రమ్మన్నారు" అంది. నాకు తనది చెప్పేసరికి ఏడుపు యెక్కువై తులసిని పట్టుకుని ఏడ్చేశాను. తులసి తాగడానికి నీళ్ళు తెప్పించి, నన్ను చూసి తనకి ఏడుపు వచ్చింది. "సారు కింద పడలేదమ్మా! కిరణ్ వెళ్ళి పట్టేసుకున్నాడు" అని చెప్పింది. తరువాత సినిమాలో పాల్గొనే అబ్బాయిలు, అమ్మాయిలు వచ్చి నాకు ధైర్యం చెప్పసాగారు. షూటింగయి రూంకి వెళ్ళాలి కదా, మెట్లు దిగాలి. ఎలా? ఇంకా నా గుండె ధడధడా నాకాళ్ళు వొణుకుతునే ఉన్నాయి. ఆ సినిమాలోని హీరో అజయ్ నన్ను చెయ్యి పట్టుకుని నేను దిగడానికి సహాయం చేశాడు. హోటలు కెళ్ళి మావారి మోకాలిని Volini Zel, రాసి వేడినీళ్ళు కాపడం పెట్టాను. Dolo - 650 ఇచ్చాను. ఆయన నిద్రపోయారు. కానీ నాకు నిద్రమాత్రలు వేసుకున్నా కానీ నిద్రరాలేదు. ఆ జరిగిన దృశ్యాలే తల్చుకుంటూ ఏడుస్తు పడుకున్నాను.

మర్నాడు షూటింగు పొద్దున్న లేదన్నారు. ఆ వేళ మధ్యాహ్నం ఆ గంటకి కారు వస్తుందన్నారు కదా అని పొద్దున్న టిఫిన్ తినకుండా మధ్యాహ్నం 12.30కల్లా లంచ్ తిన్నాము. ఒంటిగంటకల్లా లిఫ్టులో కిందకు వెళ్ళి కారుకోసరం వెయిట్ చేసాము. 1.45 అయినా కూడా కారు రాలేదు. మావారు ఫోన్ చేస్తే ఇంకా గంటపడ్తుంది అన్నాడు. మేం మళ్ళీ రూంకెళ్ళి వెయిట్ చేసాము. గంటదాటినా కూడా కారు రాకపోతే మావారు కిరణ్ గారికి ఫోన్ చేస్తే, అసలు షూటింగు ఉంటుందో ఉండదో ఫోన్ చేసి చెప్తానన్నారు. మావారు వెయిట్ చేసి, నిద్రపోయారు.

అయిదుగంటలయింతర్వాత, మావారు నిద్రలేచిన తర్వాత కాఫీలయ్యాయి. మావారు కాలు చాలా వాచింది. నాకు భయం వేసింది. 'చూడండి! పక్కనే యశోదా ఆస్పత్రికెళ్ళి ఎక్స్‌రే తీయించుకుందాం. అదే మద్రాసులో ఉంటే విజయా ఆస్పత్రికి వెళ్తాం కదా" అన్నాను. "నాకిక్కడ ఏ డాక్టర్లు తెలియదే" అన్నారు.

"మీరు ఫలానా అని చెపితే ఎవరు ట్రీట్‌మెంట్ ఇవ్వరు" అన్నాను. పొద్దున్నుంచి ప్రొడ్యూసరు కానీ, డైరెక్టరు కానీ, వాళ్ళ వాళ్ళ పనులవత్తిడివల్ల రాలేదు మా రూముకి.

మావారన్నారు, "శ్రీనివాస్ గారికి ఫోన్ చేసి కనుక్కుంటాను, ఎవరైనా డాక్టర్లు తెలుసేమోనని", చేస్తే ఆయన ఫలానా డాక్టరు తెలుసునని ఫోన్ చేసి చెప్పారు. మేము ఆటో చేయించుకుని వెళ్ళాము. శ్రీనివాసుగారు తాను రాలేని పరిస్థితిలో ఒక మీటింగులో ఉన్నానని కారు పంపుతానని అన్నారు. కానీ కారు రావడానికి ఒక గంట పడ్తుంది. అందుకని ఆటో చేయించుకుని వెళ్ళాము. నడిచివెళ్ళేంత దగ్గరే, కానీ ఆయన కాలు నొప్పితో ఎలా నడుస్తారు? ఎక్స్‌రే తీసి, బ్యాండేజి కట్టి, ఐస్ బాగ్ యిచ్చాడు. కొన్ని మాత్రలు రాసిచ్చారు. పది నిమిషాలలో పనైపోయింది. ఆ రాత్రి హాయిగా నిద్రపోయాను.

మావారి షూటింగు ఫిబ్రవరి 14తో పూర్తయింది. 15వ తారీఖున మాకు ఖాళీ. ఆవేళ పెళ్ళి కూతురికి యివ్వవలసిన గిఫ్ట్, నేను కొన్ని చీరలు, కొన్ని ఊరగాయలు, స్వీట్సు వగైరా షాపింగ్ చేసుకుని అక్కడే వున్న మినర్వా హోటల్‌లో భోంచేసి, షాపింగ్ కంటిన్యూ చేసి సాయంత్రం 5గంటలకి రూము చేరాము. మావారికి కొంచెం కాలు నొప్పి యెక్కువైంది. ఆస్పత్రి వాళ్ళిచ్చిన ఐస్ బాగ్‌తో కాపడం

పెట్టుకున్నారు. మర్నాడు 16వతేదీ. ఆ సాయంత్రం మేము జానవాసానికి అంటే ప్రధానానికి వెళ్ళాలి. పొద్దున్న ప్రొడ్యూసర్ గారు, భార్య లలిత మా రూముకొచ్చి కాసేపు మాట్లాడి, మావారిని వెంటనే వచ్చి చూడనందుకు బాధపడి వెళ్ళారు. ఇంకాసేపటికి మా రఘుమ, వాళ్ళాయన వచ్చారు. దానికి మెడ్రాసునుంచి అది కోరిన ప్రకారం ఒక పట్టుచీరకొని తెచ్చాను. అది కలెక్ట్ చేసుకుని దానికైన పైకం ఇచ్చి, నే కోరిన ప్రకారం బెంగుళూరు నుంచి తెచ్చిన వడియాలు, దేవుడి వత్తులు నాకిచ్చి వెళ్ళిపోయింది.

సాయంత్రం కంపెనీ కారు తెప్పించుకుని, జానవాసానికి వెళ్ళి మండపానికి వెళ్ళాను. భోజనాలైన తర్వాత చెయ్యి కడుక్కోవడానికి వెళ్తూ మెట్టు తట్టుకుని బొక్కబోర్లా పడ్డాను. ముందే చెయ్యి కడుక్కుని వెళ్ళిపోయిన మావారికి విషయం తెలియదు. నన్ను నలుగురైదుగురు లేవనెత్తి, నేను కుంటుతూ రావడం చూసి నిర్ఘాంతపోయారు. కానీ మేము వెళ్ళినప్పట్నుంచీ జయశ్రీవాళ్ళ పెదనాన్నగారబ్బాయి, మాకు మదరాసులోని పరిచయం వలన బాగా కనుక్కున్నాడు. కూడానేవుండి కారెక్కేవరకు మమ్మల్ని బాగా చూసుకున్నాడు.

మర్నాడు రాగలనో లేదో ముహూర్తానికనుకున్నా, కానీ పెళ్ళికి మా రఘుమ, రామకృష్ణారావు, మా పద్మ, బాబు వస్తారు కదా అని 17 పొద్దున్న పెళ్ళికి వెళ్ళాము. రఘుమ వాళ్ళు రాలేదు కానీ పద్మ, బాబు వచ్చారు. భోజనాలైనతరాత ఎవరిదారిన వారు వచ్చేశాము.

షూటింగులో మా వారు పడగానే శకుంతల కొంచెం సెంటిమెంటల్‌గా బాధపడింది. కానీ సుధ మామీద ఉన్న ప్రేమతో వాళ్ళ నాన్న పడగానే, "ఈ వయసులో అమ్మా, నాన్నగారికి ఈ ప్రయాణాలు, అక్కడకెళ్ళి పడడాలు అవసరమా! నాన్నగారసలు యాక్టింగ్ కి ఎందుకు ఒప్పుకోవాలి? ఇద్దరూ అలా ఒంటరిగా ప్రయాణాలు చెయ్యకపోతేనేం" అని శకుంతలకి ఫోన్ చేసిందట. మొత్తం మీద 17న సాయంత్రం 6గంటలకల్లా మద్రాసు చేరుకున్నాము.

నేను రెగ్యులర్‌గా తెలుగు టి.వి సీరియల్స్ కొన్ని, రాత్రి భోజనాలయినతర్వాత రెండు తమిళ సీరియల్స్ చూస్తుంటాను. ఇవిగాక ఎస్.పి.బాలసుబ్రమణ్యంగారి "పాడుతా తీయగా", సాయికుమార్ 'వావ్', సుమవి కొన్ని, అప్పుడప్పుడు వంటల ప్రోగ్రాంలు, మిగతా ఏంకర్సు ప్రోగ్రాంలు చూస్తూ ఉంటాను. నాతోపాటు మావారు కూడా చూస్తూ ఉంటారు. చిన్నపిల్లల ప్రోగ్రాంలో, పాడుతాతీయగా ప్రోగ్రాంలో పార్టిసిపేట్ చేసిన చిన్నారి సింగీతం అంజనీ నిఖిల మా వారికి స్వయానా చిన్నాన్నగారి ముని మనవరాలు. అది చాలా ఎపిసోడ్లలో అవార్డు గెల్చుకుని, ఒక్కసారి కూడా ఎలిమినేట్ అవకుండా పైకి వచ్చింది. సింగీతం రాధాబాయి అని చాలా సంవత్సరాల క్రితం పలుసార్లు విజయవాడ రేడియోలో లలిత సంగీతం పాడ్తూ వచ్చింది. ఆవిడ నాకు తోటికోడలు అవుతుంది. ఆవిడ మనవరాలే ఈ అంజు. వాళ్ళ ఫైనల్ ఎపిసోడ్స్ అంతా అయి, ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యంగారు వాళ్ళకి అమిత బాధపడ్తూ వీడ్కోలు పలుకుతూంటే నాకు చాలా ఏడుపు వచ్చింది. ఆ చిన్నారులని "యిప్పటితో మీ ఎపిసోడ్స్ అన్నీ అయిపోయాయి. మనం మళ్ళీ ఎప్పుడు కలుసుకుంటామో, మీరు పెద్దవాళ్ళయి మంచి పేరు ప్రఖ్యాతులు గాంచాలని వాళ్ళని దీవిస్తుంటే నా మనసు కలిచివేసింది. వెంటనే ఆయనకి ఫోన్ చేసి నా ఫీలింగ్స్‌ని, వాళ్ళని దీవించినరీతిని, ఆయన్ని అభినందించాను.

అలాగే 'వావ్' ప్రోగ్రాంలో సాయికుమార్ ఏంకరింగ్ చూసి అతనికి ఒకరోజు ఫోన్ చేసి అభినందించాను. నిజానికి అతని తల్లి, నేను హాస్పటల్‌మేట్స్. ఇద్దరూ మా ప్రెగ్నెన్సీలలో అక్కడ కలుసుకునేవాళ్ళం. ఆవిడ మా పిల్లల పెళ్ళిళ్ళకి కూడా వచ్చింది పాపం. ఒకరోజు సాయికుమార్ మా యింటికి ఫోన్ చేస్తే నేనే తీసుకున్నాను. "నేను సాయికుమార్" అని అతను చెప్పగానే "మీ అమ్మగారెలా ఉన్నారు?" అనడిగాను. బొంగురు పోయిన గొంతుతో "అది చెప్పడానికే ఫోన్ చేశాను నేను" అనేసరికి నాకు విపరీతమైన షాక్ కల్గింది. చాలా చిన్నతనంలోనే పోయింది అని బాధపడ్డాను.

మా సుధ వాళ్ళు 2012లో మే సెలవలకు అమెరికా ప్రయాణం పెట్టుకున్నారు. అక్కడ దాని కాలేజీ ఫ్రెండ్స్, స్కూల్ ఫ్రెండ్స్ నలుగురైదుగురు ఉన్నారు. వాళ్ళు ఇన్ని సంవత్సరాలైనా వాళ్ళ స్నేహితురాలు సుధని మర్చిపోకుండా ఉన్నారు. వాళ్ళు పెళ్ళయి పిల్లల్తో,

భర్తతో అమెరికాలో ఉంటున్నా, సుధ కుటుంబం అమెరికా వస్తుందని తెలియగానే వాళ్ళే ఎయిర్‌పోర్ట్‌కు వచ్చి పిల్చుకెళ్తామని, హోటల్‌లో ఉండి డాలర్లు ఖర్చుపెట్టుకోవద్దని, వాళ్ళ ఇళ్ళల్లోనే ఉండమని, వాళ్ళే అమెరికాలోని ప్రదేశాలు, సైట్‌సీయింగ్‌కి పిల్చుకెళ్తామని మెయిల్ చేస్తూ వచ్చారు. బంధువుల సంగతి ఎలా ఉన్నా, ఈ కాలంలో ఫ్రెండ్షిప్‌కి మించిన భాగ్యం ఇంకేదీలేదు. అనుకున్న ప్రకారం సుధ అమెరికాలో అందరి స్నేహితులతో కలిపి, ఆఖరి నాలుగురోజులు దాని బెస్ట్ ఫ్రెండైన సుజాతతో గడిపి వచ్చింది. మా సుధకు ఇలా గడిపిన రోజులు మాత్రం జీవితంలో మరచిపోలేని సంఘటనలు.

ఈ యాభై రెండేళ్ళ జీవిత గాథలో ఎన్నో ఒడుదుడుకులు చవిచూసాను. అయినా ఇన్ని వసంతాలు చాలా మధురంగా గడిచిపోయాయి. కానీ నేను యీ కథని రాసినన్నాళ్ళూ కొన్ని సంఘటనలు రాస్తున్నంతసేపు నా ఫీలింగ్స్, ఎమోషనల్‌గా ఫీలయ్యి కన్నీటి రూపాలుగా వదిలి నా బరువు దింపుకున్నాను. అదెందుకు అలా ఫీలయ్యానో నే చెప్పలేకపోతున్నాను. ముఖ్యంగా రెండు సంఘటనలు నా జీవితంలో అమితంగా బాధించాయి. మొదటిది నా మొదటి ప్రసవం - అపజయం - రెండవది మావారికి ఉద్యోగం లేనప్పుడు ఆయన చేసిన ప్రయత్నాలు, ప్రయోగాలు. పెళ్ళికి ముందు ఒకటి - రెండు సంఘటనలు. నా జీవితంలో అపజయం కన్నా విజయమనే శాతమే యెక్కువ.

1991వ సంవత్సరంలో షష్టిపూర్తి చేసుకుని హోమం అదీ చేయించాము. 2010వ సంవత్సరంలో మా యాభై ఏళ్ళ గోల్డెన్ జూబ్లీ సందర్భంగా ఇటు హోమం, సత్యనారాయణ వ్రతం, అటు బంధువులు, స్నేహితుల సమక్షంలో భోజన కార్యక్రమాలు ఆఖరుకి కేక్ కట్ చెయ్యడం చేసుకున్నాము. తరువాత మా వారికి 81వ ఏట అడుగిడింది. శ్రేయోభిలాషులూ, బంధువులు, మూడవసారి కూడా హోమం చేయిస్తే బాగుంటుందని అన్నారు. పైగా శతాభిషేక కూడా చేయించుకోవాలని సలహా యిచ్చారు. మార్చి 17వతేదీన 2012వ సంవత్సరం శనివారంనాడు మంచిరోజు, మా వారి నక్షత్రం కలిసి వచ్చింది అన్నారు. హోమం చేయించి, స్నేహితులని, బంధువులని, ఆహ్వానించి కన్నుల పండుగగా, ఆ వచ్చిన వారంతా మనఃపూర్వకముగా మాకు పాదాభివందనాలు చేసి, మా ఆశీర్వాదాలు తీసుకున్నారు. మా చెల్లెలు రఘుమ, వాళ్ళాయన వచ్చారని వేరే చెప్పక్కర్లేదు. ఒక్కరిద్దరు తప్ప అందరూ మా కన్నా చిన్నవాళ్ళేగా? మా యిద్దరమ్మాయిలు చి.సౌ.శకుంతల, చి.సౌ సుధ దగ్గరుండి చక్కగా జరిపించారు. ఈ శతాభిషేకం అన్నది చాలా అరుదుగా వచ్చే సందర్భం. ఆ భగవంతుడు కరుణించి మమ్మల్నిద్దర్నీ చిరంజీవులుగా దీవించి, ఇలా చేయించాడు. తర్వాత మూడురోజులకే అంటే మధ్యాహ్న భోజనాలక్కడే తీర్చేసుకుని వచ్చిచేరాము. ఏటేటా ఆ అమ్మవారికి మా పెళ్ళి రోజున చీర కట్టించే ఆనవాయితీ.

మంత్రాలయంలో వెలసిన ఈ మాంచాలమ్మ. అక్కడికి వెళ్ళిన వారందరూ ఈ మాంచాలమ్మ తల్లిని దర్శించుకునే లోపలికి వెళ్ళి శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకోవాలన్నమాట. ఇదేకాక మాకింకొక ఆచారం కూడా ఉంది. నెల్లూరు జిల్లా గూడూరులో శ్రీ నారాయణమ్మ అనే దేవత కూడా ఉంది. మేము ఎప్పుడు గూడూరుకి వెళ్ళినా, ఈ అమ్మవారిని దర్శించుకుని, పూజలు, అభిషేకాలు జరిపించి, చీర కూడా కట్టిస్తుంటాము. గూడూరుకి వెళ్ళే దారిలో సూళ్ళూరుపేటలో చెంగాళమ్మ అనే దేవత గుడి కూడా వుంది. గూడూరుకి వెళ్ళినప్పుడల్లా, ఈ దేవతని కూడా దర్శించుకుని వెళ్తూంటాము.

మావారి 81 సంవత్సరం శతాభిషేకం మార్చి 17న. మా పెళ్ళిరోజు 52 వసంతాలు వెళ్ళి 53వ సంవత్సరంలో అడుగుపెట్టాము. భగవంతుడు మమ్మల్ని ఆశీర్వదించడంవలన, మా పిల్లలు చేసుకున్న అదృష్టం వలన మా జీవిత నౌక సాఫీగా ప్రయాణం చేస్తోంది. నా మాంగల్య భాగ్యం వలన చాలా ధన్యురాలనయ్యాను. ఆ దేవుని దయవలన మేమూ, మా పిల్లలు, బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు అందరూ చల్లగా బాగుండాలని ఆ భగవంతుడిని కోరుకుంటున్నాను.

(సమాప్తం)

Post your comments